సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024


సీఎం ప్రసంగిస్తుండగా మద్దతు తెలుపుతున్న మహిళామణులు

కలల సాధకుడు అడుగిడిన వేళ.. విద్యలనగరం పులకించింది. డప్పువాయిద్యాలు.. సాంస్కృతిక ప్రదర్శనలతో మోదవలస వద్ద జిల్లా ప్రజానీకం ఘనంగా స్వాగతం పలికింది. ప్రజాసంక్షేమ ప్రదాత, అభివృద్ధి కారకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి హారతులు పట్టింది. మోదవలస నుంచి చెల్లూరు వరకు వందలాది బైక్‌లతో పార్టీ శ్రేణులు, అభిమానులు ముందుసాగారు. దారిపొడవునా జగనన్నకు జనం జేజేలు పలికారు. డ్రీమ్స్ మీవి.. స్కీమ్స్ నావి అంటూ జగనన్న చెబుతుంటే చప్పట్లతో స్వాగతించారు. పల్లె కల నెరవేర్చే విధానం వివరిస్తుంటే మురిసిపోయారు. 58 నెలల పాలనలో వివిధ వర్గాలకు చేసిన మేలును తెలియజేస్తుంటే మద్దతు తెలిపారు. ఉచిత హామీలతో చంద్రబాబు మోసం చేసిన తీరును చెబుతుంటే... మోసపోయామంటూ నిట్టూర్చారు. ప్రతి ఇంటా 'నవరత్న'వెలుగులు నింపామని, సంక్షేమ, అభివృద్ధి పాలనకు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలన్న జగనన్న పిలుపునకు.. సెల్‌లైట్లు వేసిమరీ మేమంతా సిద్ధం అంటూ నినదించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తామని మాట ఇచ్చారు.



మేమంతా సిద్ధం చెల్లూరు సభకు హాజరైన జనసందోహం

సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

- జయహో వైఎస్సార్‌సీపీ
- మేమంతా సిద్ధం సభకు హోరెత్తిన ప్రజాభిమానం
- జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- జెండాలతో జయజయ ధ్వానాలు పలికిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు
- చంద్రబాబు మోసలపై విమర్శలకు అవునంటూ జనం మద్దతు
- ప్రసంగం ఆద్యంతం సీఎం..సీఎం .. అంటూ హోరెత్తిన ప్రజానీకం
- అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో భావోద్వేగానికి గురైన మంత్రి బొత్స

కలలు నెరవేర్చే కార్యసాధకుడికి.. జేజేలు

విజయనగరం/బొబ్బిలి:

నేల ఈనిందా..? పుడమితల్లి ఇంతమందిని మోసిందా..? ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి విజయనగరం మండలం చెల్లూరు వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం ఎన్నికల ప్రచార సభకు హాజరైన జన ప్రభంజనాన్ని చూసిన వారంతా చేసిన వ్యాఖ్యలివి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రచార సభకు జిల్లా నలుమూలల నుంచి జనం పోటెత్తారు. జగనన్న రాకకు జయజయధ్వానాలు పలికారు. మధ్యాహ్నం వేళ కాస్తున్న ఎండను సైతం లెక్క చేయకుండా జిల్లా కేంద్ర సమీపంలోని చెల్లూరు జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష ఆధ్వర్యంలోని గీతాలకు జనం హుషారుగా నృత్యాలు చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అరగంటలో రానున్నారనగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు వేదికపైకి చేరుకున్నారు. వేదికపైకి ముఖ్యమంత్రి వస్తున్న దృశ్యాలను స్క్రీన్‌పై చూసిన జనం ఆనందానికి అవధులు లేవు. సీఎం..సీఎం అంటూ కేరింతలు కొట్టారు.

తరలివచ్చిన ప్రజాభిమానం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లా కేంద్రంలోని చెల్లూరుకు వస్తున్నారని తెలిసిన విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో సభా ప్రాంగణానికి మధ్యాహ్నానికే చేరుకున్నారు.

ర్యాంప్‌పై సీఎం నడక... వెనుక నాయకులు...

సాయంత్రం 5 గంటల సమయంలో విజయనగరం నియోజకవర్గంలోని చెల్లూరు సభా వేదికపైకి చేరుకున్న సీఎం వెంటనే ప్రజలకు అభివాదం చేశారు. వేదిక పైకి వచ్చిన వెంటనే నేరుగా ర్యాంపుపై పులిలా నడచివస్తుంటే అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ఆయన వెనుక జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఈ సమయంలో పలువురు అభిమానులు చేతిపై హారతులు ఇస్తూ జయహో జగనన్న అంటూ కేరింతలు కొట్టారు. అనంతరం సభా వేదికపైకి చేరుకుని ఎమ్మెల్యేలు, మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ప్రసంగించారు. కోలగట్ల ప్రసంగం అయిన వెంటనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తన ప్రసంగాన్ని ప్రారంభించగానే ప్రజల కేరింతలు మిన్నంటాయి. సీఎంసీఎం అంటూ నినదించారు. ప్రజానీకాన్ని ఉద్దేశించి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 58 నెలల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధికలిగిందా లేదా అంటూ ప్రజలతోనే చెప్పించడం సభికులను ఆకట్టుకుంది. చంద్రబాబు వంటి మోసగాడ్ని ఏమని పిలుస్తారని సీఎం జగన్ ప్రజలను అడగ్గా 420 అని పదే పదే చెప్పగా బాగా చెప్పారు అటువంటి వారిని 420 అనే అంటారంటూ సభికులకు తిరిగి సమాధానమిచ్చారు. పేద, మధ్యతరగతి ప్రజల డ్రీమ్ మీ బిడ్డ జగన్‌స్కీమ్ అని అన్నప్పుడు జయ జయ ధ్వానాలు చేశారు. ఈ సమయంలో సంక్షేమ పథకాలు, పరిపాలన మీకు నచ్చినట్లయితే మీ జేబుల్లోంచి సెల్ తీసిలైట్లు వెలిగించడని కోరిన వెంటనే ఆకాశంలోని చుక్కల్లా సెల్‌ఫోన్ లైట్లు వెలిగాయి. తమ అభిమాన నాయకుడి సూచనను పాటిస్తూ జై జగన్ నినాదాలు మిన్నంటాయి. అంతకు ముందు ప్రజలచేత ఇలా చేయి ఊపండనీ, నిజమేనా అక్కా, నిజమేనా చెల్లెమ్మా..అన్నా అని అడిగినప్పుడు ప్రజలంతా ముక్తకంఠంతో అవును అవును అంటూ సీఎం జగన్‌తో మాట కలిపారు.

భావోద్వేగానికి గురైన మంత్రి బొత్స...

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగం అనంతరం విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులను ప్రజలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం, గజపతినగరం, ఎచ్చెర్ల అభ్యర్థులు కోలగట్ల వీరభద్రస్వామి, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, తలే రాజేష్, బొత్స అప్పలనరసయ్య, గొర్లె కిరణ్‌కుమార్‌లను ప్రజలకు పరిచయం చేసి సౌమ్యులు, పరిపాలనాదక్షులైన వీరిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. అందులో భాగంగానే మంత్రి బొత్స సత్యనారాయణను పరిచయం చేసినప్పుడు ప్రజల హర్షధ్వానాలు మిన్నంటాయి. ఆ సమయంలోనే మంత్రి బొత్సను ప్రత్యేకంగా తనకు తండ్రి సమానులని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరినప్పుడు జనం కేరింతలు కొట్టగా మంత్రి బొత్స ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పాలవలస విక్రాంత్, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అస్వస్థత


చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలు

బలిజిపేట: మండలంలోని వంతరాం గ్రామంలో ఇద్దరు ఉపాధి కూలీలు పిడుగుపాటుతో అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన పల్ల కమలమ్మ, బి.గౌరీశంకరరావు, గంగలు గ్రామంలో ఉండే దత్తేశ్వరం చెరువులో ఉపాధి పనికి బుధవారం సాయంత్రం వెళ్తున్నారు. చెరువులో గుమ్మువద్దకు వెళ్తున్న సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడడంతో ముగ్గురూ గాయాలపాలయ్యారు. అయితే వారిలో గంగ స్పృహలోకి వచ్చింది. మిగిలిన ఇద్దరిని వెంటనే రాజాం కేర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనంతరం న్యూరాలజీ కోసం విజయనగరం ప్రభుత్వ హాస్పిటల్‌కు వైద్యులు రిఫర్ చేశారు.

నేడు రాజన్నదొర రెండవసెట్ నామినేషన్


పీడిక రాజన్నదొర | అలజంగి జోగారావు | గుమ్మ తనూజారాణి

సాలూరు: వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర బుధవారం రెండవసెట్ నామినేషన్ వేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్యామలాంబ ఆలయంలో పూజలు చేసిన అనంతరం మెయిన్‌రోడ్డు, డబ్బివీధి, అఫీషియల్ కాలనీ తదితర వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీకి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు భారీగా తరలి రానున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు..

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు, అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఉదయం 11 గంటలకు పార్వతీపురంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యేగా జోగారావు, కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థిగా తనూజారాణి నామినేషన్ సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు పాతబస్టాండ్ కూడలి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కార్యాలయాలకు చేరుకుని నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నామినేషన్ ఘట్టంలో నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఆర్డీఓ హేమలత అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టార్ అధికారులకు అప్పగించిన పది పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో గల పీఓల సమన్వయంతో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎంసీసీ) అమలుపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల నిర్వహణ పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో బదిలీ


బదిలీ అయిన పీవో కల్పనాకుమారి | బాధ్యతలు చేపట్టిన జేసీ శోభిక

సీతంపేట: జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారిని బదిలీ చేస్తూ చీఫ్‌సెక్రటరీ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏప్రిల్ 12, 2023న సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఆమె బాధ్యతలు చేపట్టి ఏడాది పాటు పనిచేశారు. ప్రస్తుతం పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఎఫ్‌ఏసీగా జేసీ శోభిక..

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను జేసీ ఎస్ఎస్ శోభిక మంగళవారం చేపట్టారు. ఆమె పాలకొండ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు.

ఐటీడీఏ డిప్యూటీ ఈవోగా నారాయుడు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ ఈవోగా మల్లి ఆశ్రమపాఠశాల హెచ్‌ఎం పాలక నారాయుడికి ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉప విద్యాశాఖాధికారిగా పనిచేసిన ఎ.లిల్లీరాణి మార్చి నెలాఖరున పదవీవిరమణ చేశారు. ఈ స్థానంలో ఖాళీ ఏర్పడింది.

ఐటీడీఏ పీఓగా సుభామ్ బన్సాల్


సుభామ్ బన్సాల్

సీతంపేట ఐటీడీఏకు నూతన ప్రాజెక్టు అధికారిగా ఎస్‌హెచ్ సుభామ్ బన్సాల్‌ను నియమిస్తూ ఎన్నికల కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల మేరకు బుధవారం విధుల్లో చేరి మధ్యాహ్నం 1 గంటలోపు జాయినింగ్ రిపోర్టు సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ తలే రాజేష్‌కి వైఎస్సార్‌సీపీ బీ ఫామ్


రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బీ-ఫామ్ అందుకుంటున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ అధిష్టానం నుంచి బీ-ఫామ్ అందుకున్నారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ ఫామ్ ను అందుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అత్యధిక ఓట్లతో రాజాం ఎమ్మెల్యేగా గెలవాలని రీజనల్ కోఆర్డినేటర్ తనను ఆశీర్వదించారని డాక్టర్ రాజేష్ ఇక్కడ మీడియాకు తెలిపారు.

మే 13న వేతనంతో కూడిన సెలవు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న జరిగే పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్టు జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎస్.సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాదా దుకాణాలు, సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు దుకాణదారులు, వివిధ సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

జీడి తోటలో కారుచిచ్చు

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో లచ్చన్నదొరపాలెం జీడితోటల్లో రేగిన కారుచిచ్చుతో 20 ఎకరాల్లో జీడిమామిడి తోటలు కాలిపోయాయి. మధ్యాహ్న సమయంలో గాలులు వీయటం, ఎండ తీవ్రంగా ఉండటంతో మంటలు శరవేగంగా వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు దగ్గరలో ఎటువంటి నీటి వసతి లేకపోవటంతో కళ్ల ముందు తోటలు కాలుతున్నా ఏమీ చేయలేకపోయారు. ఎస్.కోట అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఎన్ని దఫాలు ఫోన్ చేసినా వెహికల్ వేపాడలో ఉంది, కొత్తవలసలో ఉందని చెప్పారు తప్ప వెహికల్ రాలేదని గిరిజన రైతులు వాపోయారు. నష్టపోయినా రైతుల్ని ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నిందితునికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటూ రూ.2,500 జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించారని దిశా మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్లె రాంబాబు 2021 జూలై 5న ఒక ఇంట్లోకి చొరబడి మైనరు బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశా మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మహిళా ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ప్రారంభం నుంచి దిశా పోలీసులు సాక్ష్యులను, ఆధారాలను ప్రవేశపెట్టడంతో నిందితునిపై నేరారోపణలు, రుజువుకావడంతో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి కె.నాగమణి నిందితుడు గొర్లె రాంబాబుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. కేసులో నిందితుడిపై నేరం నిరూపణయ్యే విధంగా పోలీసుల తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, దిశా ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ బి.నాగేశ్వరరావు, పర్యవేక్షణలో దిశా పోలీసుస్టేషన్ కోర్టు హెచ్‌సి శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్‌లో సహాయ సహకారాలను అందించారన్నారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన 20 గడ్డివాములు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో వరుసగా రెండో రోజు మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 20 గడ్డివాములు, రెండు పశువుల శాలలు, 20 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు కాలిపోయాయి. సోమవారం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు కాలిపోయిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన దిగువ వీధి కల్లాల్లో ఉన్న రైతులందరికి చెందిన గడ్డివాములు రెండు రోజులుగా జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఈదుబిల్లి అప్పలస్వామి, ఆదినారాయణ, కరణం రమేష్, తిరుపతి తదితరులకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. ఇదే ప్రమాదంలో ఈదుబిల్లి అప్పలస్వామి, ఆదినారాయణలకు చెందిన 20 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దిగువవీధికి చెందిన రైతులంతా ఏడాది పొడవునా పశువులకు మేత వేసేందుకు నిల్వ చేసుకున్న గడ్డివాములన్నీ పూర్తిగా కాలిపోవడంతో పశువులకు మేత ఏమి వేయాలో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా రెండు రోజులు అగ్ని ప్రమాదం జరిగి గడ్డివాములు దగ్ధం కావడంపై రైతులంతా ఆందోళన చెందుతున్నారు. అగ్ని ప్రమాద సమాచారాన్ని గ్రామస్తులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి ఇవ్వడంతో అధికారులు, సిబ్బంది అగ్నిమాపక శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంపై రెవెన్యూ అధికారులు వచ్చి నష్టాన్ని అంచనా వేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

హలో..హలో..!

- కొండప్రాంతాలకూ సెల్‌సిగ్నల్స్
- శరవేగంగా టవర్ల నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించిన మరో ఘనత
- మన్యంలో డిజిటల్ విప్లవం

సాక్షి, పార్వతీపురం మన్యం: టెక్నాలజీ మనుషుల జీవన విధానంలో నేడు ఒక భాగంగా మారినా.. అక్కడ మాత్రం సాంకేతిక పరిజ్ఞానం, అక్షరాస్యత అంతంత మాత్రమే. సమాజానికి దూరంగా అక్కడక్కడ విసిరేసినట్లు ఉండే గిరిజన గ్రామాలవి. ఇక్కడ నివాసం ఉంటున్న వారిలో అధిక శాతం మంది నిరక్షరాస్యులే. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించడమే వారి దినచర్య. కనీసం ఎవరికైనా ఫోన్ చేయాలన్నా..సిగ్నల్ అందక నానా ఇబ్బందులు పడేవారు. అటువంటిది ఇప్పుడు మూరుమూల కొండ ప్రాంతాల్లోనూ గిరిజనులు తమ ఫోన్లలో అంతరాయం లేకుండా వీడియో కాల్ చేసుకోగలుగుతున్నారంటే డిజిటల్ విప్లవం ఏజెన్సీలో ఎంతగా వృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. సిగ్నల్ అందని ప్రాంతం ఉండకూడదన్న ప్రధాన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ కింద ఇటీవల రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ టవర్ల నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 4జీ నెట్‌వర్క్‌తో 196 టవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటు న్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేయాల్సిన 60 టవర్లకు అటవీశాఖ అనుమతులు కూడా ఇచ్చింది. ఇందుకు రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా టవర్ల నిర్మాణం పూర్తయింది. వాటి నుంచి సేవలు అందుతున్నాయి. మరికొన్ని తుదిదశకు వచ్చాయి. టవర్ల ఏర్పాటుతో గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు 40 వేల మందికి డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

పెరిగిన కనెక్టివిటీ..

ఇప్పటికీ గిరిజన ప్రాంతాలు అనేకం బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం వరకు సెల్‌ఫోన్ సేవలు కూడా ఉండేవి కావు. గతంలో ఏదైనా సమాచారం అందాలంటే కాలినడకన వెళ్లి చెప్పాల్సిందే. కనీసం ఒక రోజైనా పట్టేది. ఫోన్లు ఉన్నా సిగ్నల్స్ కోసం కొండలు, గుట్టలు ఎక్కాల్సి వచ్చేది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సెల్ టవర్లు రావడం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సమాజంతో కనెక్టవిటీ పెరుగుతోంది. టీవీలు, ఫోన్లు పని చేస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే పథకాలన్నింటినీ వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం వేగవంతమవుతోంది. డిజిటల్ లావాదేవీలూ పెరిగాయి. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు-నేడుతో బాగు పడిన పాఠశాలలు ఇవన్నీ గ్రామాన్ని, గ్రామ రూపురేఖలను మార్చే దిశగా పడుతున్న అడుగులు. కనెక్టివిటీ కూడా అందులో ఒక భాగంగానే ప్రభుత్వం భావించి పనులు చేపట్టింది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకూ ఈ సెల్ టవర్లు దోహదపడతాయి. గతంలో గిరిజన, మారు మూల ప్రాంతాలకు సిగ్నల్స్ లేకపోవడంతో పోలింగ్ రోజున ఇబ్బంది తప్పేది కాదు. అక్కడ నుంచి సమాచారం రావడం ఆలస్యమయ్యేది. ఇప్పుడు సెల్ టవర్లు పెరగడం వల్ల కేవలం 70 చోట్ల మాత్రమే సిగ్నల్స్ లేని కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించి..అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పుడే తమకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లుందని పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రజానీకం చెబుతున్నారు.


సాలూరు మండలం మారుమూల మాలమామిడి వద్ద ఏర్పాటు చేసిన సెల్‌టవర్

అంతరాయం లేకుండా సిగ్నల్స్



గతంలో మాకు సెల్ సిగ్నల్స్ సరిగ్గా అందేవి కావు. ఇబ్బందులు పడేవాళ్లం. ఇటీవల ఓ కంపెనీ టవర్ ఏర్పాటు చేశారు. దీనివల్ల నిరంతరాయంగా సెల్‌సిగ్నల్స్ అందుతున్నాయి. ఏ సమాచారాన్ని అయినా తెలుసుకోగలుగుతున్నాం.

–ఒమ్మి సీతయ్య, కాకునివానివలస, మక్కువ మండలం.

సిగ్నల్ సమస్యలు తీరాయి

'సెల్ టవర్ల ఏర్పాటుతో ఏజెన్సీలో సిగ్నల్ సమస్యలు తొలగాయి. విద్య, వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో ఎవరికైనా ఫోన్ చేయాలన్నా 5 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు బంధువులతో వీడియో కాల్ మాట్లాడగలుగుతున్నాం. సచివాలయ సేవలు చేరువయ్యాయి. కొండ దిగకుండానే 1902 నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఫిర్యాదు చేయగలుగుతున్నాం. ప్రభుత్వ పథకాలు ఏము న్నాయో తెలుసుకోగలుగుతున్నాం. 108 వంటి వాహనాలకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగలుగుతున్నాం. చలపతిరావు, గిరిజనుడు, పీటీ మండ గ్రామం, జియ్యమ్మవలస మండలం

ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభివందనం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: పదవతరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతంలో పార్వతీపురం మన్యం జిల్లా వరుసగా రెండవ ఏడాది రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలవడం చాలా గర్వంగా ఉందని, ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాభివందనాలను వైఎస్సార్సీపీ సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాలూరు పట్టణంలోని తన గృహంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారికి గొప్ప విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సహాయసహకారాలు, ఉపాధ్యాయుల ప్రత్యేక కృషి.. విద్యార్థులు ఈ విధమైన ఉత్తమ ఫలితాలు సాధించడానికి దోహదపడ్డాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విద్యకు పెద్దపీట వేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా, మన రాష్ట్రంలోనే విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు, కార్యక్రమాలు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని గుర్తు చేశారు.

పది నామినేషన్లు దాఖలు

- పార్లమెంటుకు రెండు, అసెంబ్లీ స్థానాలకు ఎనిమిది


సీతంపేట: నామినేషన్ పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి (డమ్మీ) లక్ష్మి

పార్వతీపురంటౌన్: పార్లమెంటుకు రెండు, శాసన సభ స్థానానికి ఎనిమిది నామినేషన్లు మంగళవారం దాఖలయ్యాయి. అరకు పార్లమెంట్ నియోజకవర్గానికి తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా జల్లి రాంబాబు ఒక సెట్ నామినేషన్ పత్రాలను, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బి. చంటిబాబు ఒక సెట్ నామినేషన్ పత్రాలను అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్‌కు అందజేశారు.

- పార్వతీపురం శాసన సభ నియోజక వర్గంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తిన మోహన రావు ఒక సెట్ నామినేషన్ పత్రాలను, స్వతంత్ర అభ్యర్థిగా గర్భాపు మోహన రావు ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కె.హేమలతకు సమర్పించారు.
- కురుపాం నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు, తెలుగు దేశం అభ్యర్థిని తోయక జగదీశ్వరి రెండవ సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సీపీఐ (ఎం) అభ్యర్థిగా మండంగి రమణ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వీవీ రమణకు దాఖలు చేశారు.
- పాలకొండ నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభికకు ఉల్లిభద్ర లక్ష్మి దాఖలు చేశారు.

సాలూరు నియోజక వర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా కంచురి బంగారురాజు, కెల్ల మురళి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సి.విష్ణు చరణ్‌కు దాఖలు చేశారు.

తుస్సుమన్న చంద్రబాబు సదస్సు

- ఆరుగురు మహిళలతోనే ముఖాముఖి
- కరణం శివరామకృష్ణ కార్యక్రమానికి దూరం
- మధ్యలోనే జారుకున్న మహిళలు


చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

బొండపల్లి/గజపతినగరం రూరల్/దత్తిరాజేరు: బొండపల్లిలో తెలుగుదేశం పార్టీ మంగళవారం నిర్వహించిన మహిళా ప్రజా గళం సదస్సు తుస్సుమంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరైన సదస్సుకు ముందుగా బొండపల్లిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లేఅవుట్‌లో ఏర్పాట్లు చేశారు. అయితే సదస్సుకు పార్టీ ఆశించిన రీతిలో మహిళలు రాలేదు. తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో సదస్సులో వేసిన కుర్చీలు సగానికి పైగా ఖాళీగానే దర్శనమిచ్చాయి. ముందుగా మాట్లాడిన నాయకుల ప్రసంగాలు శ్రద్ధగా విన్న మహిళలు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించగానే ఒకొక్కరు మెల్లగా జారుకున్నారు. టికెట్ ఆశించిక రాక అలక పూనిన మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు వేదిక మీదకు రావడంతో సభలో కొంత ఉత్సాహం కనిపించింది. టికెట్ ఆశించిన భంగపడ్డ కిమిడి నాగార్జున రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడారు. టికెట్ ఆశించి భంగపడ్డ కరణం శివరామకృష్ణ ఎక్కడా కనిపించలేదు. ముందుగా హెలికాప్టర్‌లో బొండపల్లి చేరుకున్న చంద్రబాబు గజపతినగరంలోని ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టులోని న్యాయమూర్తి బి.కనకలక్ష్మికి తన ఎన్నికల అఫిడవిట్‌ను అందజేసి ప్రమాణం చేశారు. మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కె.అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు కొండపల్లి శ్రీనివాసరావు, అభ్యర్థి బేబినాయన తదితరులు పాల్గొన్నారు.

'గీత' దాటుతున్న విభేదాలు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి నామినేషన్‌లో బయటపడిన లుకలుకలు

సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీల మధ్య సఖ్యత లేదు. ఒకరంటే ఒకరికి గిట్టక..కత్తులు దూసుకుంటున్నారు. వర్గపోరు తారస్థాయికి చేరుకుంటోంది. అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీత కూడా తనకంటూ ప్రత్యేకంగా ఓ వర్గాన్ని కూడగడుతున్నట్లు వినికిడి. రెండు రోజుల క్రితం అట్టహాసంగా నామినేషన్ వేసిన ఆమె..కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తేను అయితే తీసుకురాగలిగారు కానీ, నియోజకవర్గంలోని నేతలను కలుపుకోలేకపోవడం గమనార్హం. సాలూరు నుంచి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థిని గుమ్మడి సంధ్యారాణి ఎంపీ అభ్యర్థి నామినేషన్ సమయంలో ఎక్కడా కనిపించలేదు. భంజ్‌దేవ్ వర్గంతో గీత కలిసి ఉండడమే ఇందుకు కారణమని తమ్ముళ్ల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు భంజ్‌దేవ్, సంధ్యారాణిల మధ్య ఎప్పటి నుంచో పొసగదన్న విషయం అందరికీ తెలిసిందే. కురుపాం నుంచి ద్వారపురెడ్డి సత్యనారాయణ వంటివారే హాజరయ్యారు.

అసమ్మతి నేతలకు అందదండలు

పార్వతీపురం నియోజకవర్గం నుంచీ టీడీపీలోని ఓ వర్గానికే ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ర్యాలీ సమయంలోనూ, తర్వాత పెట్టిన మీడియా సమావేశంలోనూ ఇదే విషయం తేటతెల్లమైందని తమ్ముళ్లు రగిలిపోతున్నారు. ర్యాలీలో కనిపించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సైతం తర్వాత జాడ లేదు. దీనికి కూడా కొత్తపల్లి గీత వైఖరే కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీలో అసమ్మతి చాపకింద నీరులా విస్తరిస్తోంది. పాలకొండలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు టీడీపీ క్యాడర్ చుక్కలు చూపిస్తోంది. పార్వతీపురంలోనూ బరిలో ఉన్న అభ్యర్థి పార్టీ సీనియర్లను సమన్వయం చేసుకుని వెళ్లడం లేదు. ఇలా అసమ్మతితో ఉన్న వారందరినీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత చేరదీస్తున్నారనే ప్రచారం ఉంది. దీనివల్ల ఆయా పార్టీల్లో ఇంటిపోరు మరింత తీవ్రమవుతోంది.

ఆన్‌లైన్‌లోనే జీసీసీ లావాదేవీలు

- డీఎం వి.మహేంద్రకుమార్


గుమ్మలక్ష్మీపురంలోని జీసీసీ గ్యాస్ గొడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న డీఎం వి.మహేంద్ర కుమార్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు (జీసీసీ) సంబంధించిన ఆర్థిక లావాదేవీలన్నీ మే నెల నుంచి ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చినందున.. జీసీసీ సిబ్బంది అందుకు అనుగుణంగా సిద్ధం కావాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలోని జీసీఎంఎస్ కార్యాలయంలో సేల్స్‌మెన్, డీలర్లతో సమావేశం నిర్వహించారు. జీసీసీ ద్వారా చేపట్టే విక్రయాలు, కొనుగోళ్లను ఆన్‌లైన్ విధానంలో చేపట్టాల్సి ఉన్నందున..సిబ్బందికి త్వరలో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో ఎంఎఫ్‌పీ కొనుగోళ్లు, నిత్యావసరాల అమ్మకాలు, సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసిన సరుకులు, నగదు రికవరీలు, డీఆర్ఎస్, ఆర్ఎండి అమ్మకాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ చెల్లింపులు అమలు చేయడం వల్ల రోజువారీ లావాదేవీలతో పాటు సిబ్బంది పనితీరు తెలుసుకునే వీలుంటుం దన్నారు. అనంతరం ఆయన గ్యాస్ గొడౌన్‌ను, బంక్‌ను పరిశీలించారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, గొడౌన్ ఇన్‌చార్జ్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ భరోసా


ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు రాగోలు అచ్చప్ప. ఈమెది సంతకవిటి మండలం మొదుగులపేట గ్రామం. ఈమెకు రెండు కాళ్లకు బోధకాలు (ఫైలేరియా) సోకింది. దీంతో ఈమెకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్ మంజూరైంది. నెలకు రూ.5 వేల చొప్పున పింఛన్ ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బులు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆమె సంతోషంగా ఉంది.




ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడు పేరు మహంతి కూర్మారావు. బాలుడిది నెల్లిమర్ల మండలం గరికిపేట. కూర్మారావుకు నెల నెల రక్తం తగ్గిపోతుండడంతో కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయడంతో సికిల్‌సెల్ ఎనిమియా అని నిర్ధారణ అయింది. ఇతనికి నెలకు రూ.10 వేలు ఫించను అందుతుంది. ఈ డబ్బులు వైద్యానికి, ఇతర ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని సంబరపడుతున్నాడు.

- ఏపీలో మాత్రమే దీర్ఘకాలిక రోగులకు ఫించను ఇస్తున్న వైనం
- నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అందజేత
- ఐదేళ్లలో రూ.50.41 కోట్లు అందజేత
- జిల్లాలో 1455 మంది లబ్ధిదారులు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేలాది మందికి దీర్ఘకాలిక వ్యాధుల పింఛన్లు అందజేస్తోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం కుష్టు, ఫైలేరియా, కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, మంచానికే పరిమితం అయిన వారు, సికిల్‌సెల్ ఎనిమీయా, తలసీమియా హిమోఫిలియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ప్రభుత్వం అండగా ఉంటూ భరోసా కల్పిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గురించి ఆలోచించిన దాఖలాల్లేవు. దీంతో ఆయా వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి బాధితులు వేలల్లో ఖర్చు చేసేవారు. ఇటువంటి పరిస్థితి నుంచి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెల పింఛన్ ఇస్తున్నారు. రూ.5 వేలు నుంచి రూ.10 వేలు చొప్పున ప్రతి నెల పింఛన్ అందజేస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ పత్రం ఆధారంగానే..

సంబంధిత వ్యాధి నిర్ధారణకు సంబంధించి ప్రభుత్వ ల్యాబొరేటరీ, వైద్యులు ఇచ్చిన నిర్ధారణ పత్రాన్ని పీహెచ్‌సీ వైద్యుడు పరిశీలించి డీఎంహెచ్‌ఓకు పంపిస్తారు. డీఎంహెచ్‌ఓ వాటిని పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతో పింఛన్లు అందుకున్న వారు జిల్లాలో 1455 మంది ఉన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు మాదిరి ప్రతి నెల ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. ఒక్క కుష్టు వ్యాధిగ్రస్తులకు మాత్రమే 3 వేల పింఛన్ అందిస్తున్నారు. ఫైలేరియా (రెండు కాళ్లకు) ఉన్న వారికి రూ.5 వేలు, క్రానిక్ కిడ్నీ ఉన్న వారికి రూ.10 వేలు, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి జరిగిన వారికి రూ.5 వేలు, పక్షవాతంతో వీల్‌ఛైర్‌లో ఉన్న వారికి రూ.5 వేలు, హిమోఫిలియా, సికెల్‌సెల్ ఎనిమియా, తలసెమియా రోగులకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మంచానికే పరిమితం అయిన వారికి రూ.5 వేలు ప్రభుత్వం అందిస్తోంది.

ఐదేళ్లలో రూ.50.41 కోట్లు అందించిన ప్రభుత్వం

2019 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ నిమిత్తం రూ.47.53 కోట్లు అందించింది. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రూ.2.70 కోట్లు, క్రానిక్ కిడ్నీ రోగులకు రూ.25.08 కోట్లు, కిడ్నీ, లివర్ మార్పిడి చేయించుకున్న వారికి రూ.93 లక్షలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ.5.52 కోట్లు, పక్షవాతం రోగులకు రూ.9.81 కోట్లు, హిమోఫిలియో రోగులకు రూ.1.38 కోట్లు, మంచానికే పరిమితం అయిన వారికి రూ.1.80 కోట్లు, సికిల్‌సెల్ ఎనిమియా రూ.97.20 లక్షలు, తలసీమియా వారికి రూ.2.22 కోట్లు అందించారు.

దీర్ఘకాలిక పింఛన్లు అందుకుంటున్న వారి వివరాలు

వ్యాధి రకం	పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య
ఫైలేరియా	90
క్రానిక్ కిడ్నీ వ్యాధి	418
కిడ్నీ, గుండె మార్పిడి	31
కుష్టు	307
పక్షవాతం	327
హిమోపోలియో	23
మంచానికే పరిమితం	60
సికిల్‌సెల్ ఎనిమియా	162
తలసీమియా	37